

# తెలుగు పంతులు

కప్పగంతుల మల్లికార్జునరావు

ఈ కథను ఆంధ్రప్రభ
సచిత్రవారపత్రిక 15.8.1963
సంచికలో ప్రచురించాము

మొట్టమొదటిసారి ఉపాధ్యాయుడుగా శాస్త్రి క్లాసులోకి అడుగుపెట్టేడు. అనిర్వచనీయమైన ఏదో ఆనందానుభూతి అతని హృదయాన్ని గిలిగింతలు పెడుతున్నది!

శాస్త్రి ఎం.ఏ. తెలుగుతో పాసయ్యేడు. ఉపాధ్యాయవృత్తి అంటే అతనికి మొదటినుంచీ ఇష్టం. రోజు రోజూ మరణించేదాకా విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవటానికి ఒక్క-ఆ వృత్తిలోనే అవకాశం వుందని అతని ఉద్దేశ్యం. నిత్యనూతంగా వుండే విద్యార్థుల హుషారులో తను జీవితాంతం భాగం పంచుకోవాలని అతని ఆకాంక్ష.

ఎం.ఏ. పాసైనా వెంటనే అతనికెక్కడా ఉద్యోగం చిక్కలేదు. ఊరికే సోమరిగా వుండటం అతనికిష్టం లేదు. పైగా ఇంట్లో ఆర్థికపు ఇబ్బందులు. అతని ఆర్జన కోసం ఎదురుచూస్తున్నారు తల్లిదండ్రులు. ఎక్కడో హైస్కూలులో తెలుగు మాస్టారు ఉద్యోగం ఖాళీగా వుందంటే దరఖాస్తు వేసేడు. అదృష్టవశాత్తూ

ఆ ఉద్యోగం వచ్చింది.

శాస్త్రి క్లాసులోకి ప్రవేశించేసరికి గోల చేస్తున్న పిల్లలంతా నిశ్శబ్దంగా లేచి నిలుచున్నారు. శాస్త్రి తృప్తిగా నిట్టూర్చి వెళ్లి కుర్చీలో కూర్చున్నాడో లేదో, క్లాసులో గుసగుసలు లేచేయి.

అతను హాజరు పుస్తకం తెరిచేడు.

"మాధవరావు"

"ప్రెజెంట్ సార్!"

"సుధాకర్"

"హియర్ సార్!"

"జగన్‌మోహనరెడ్డి"

"ఎస్ సార్!"... ఇలాగే సాగిపోతూంది. "ప్రసాద్, ఆంజనేయులు, రాఘవరావు"

"ఎస్ సార్!" అంతకు ముందు విన్న గొంతులాగా అనిపించింది. ఠక్కుమని ఆగేడు శాస్త్రి. అసలే ఎవరి పేరేమిటో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో పేరు పిల్చి విద్యార్థిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడేమో, రాఘవరావుకు బదులుగా పలికిందెవరో కూడా గుర్తు పట్టేసేడు.

"రాఘవరావు!" మళ్లీ పిలిచేడు.

నిశ్శబ్దం! ఎవరూ మాట్లాడలేదు.

"నీ పేరేమిటి?" రాఘవరావు పేరుకు బదులుగా పలికిన కుర్రాడినుద్దేశించి అడిగేడు.

ఆ కుర్రాడు లేచి నిల్చొని "సుధాకర్" అని జవాబిచ్చేడు.

"రాఘవరావు నీ స్నేహితుడా?"

"అవునండి."

"అందుకేనా అతని పేరు పిలిస్తే నువ్వు పలుకుతున్నావు?"

"నేను పలకలేదండీ!" నిజం చెప్తున్నట్లు నొక్కి పలికేడా కుర్రాడు.

"కూర్చో, ఇకనుంచైనా అబద్ధాలాడకు" అంటూ తర్వాత పేర్లు పిలువసాగేడు శాస్త్రి. "సుబ్బారావు-విశాలాక్షి, విశ్వనాథం-వసుంధర."

"ప్రెజెంటు సారూ!" అని ఎగతాళిగా ఒక గొంతు పలికింది. క్లాసంతా నవ్వులతో ప్రతిధ్వనించింది. తన గౌరవమర్యాదల గరిమనాభి తప్పుతున్నట్లనిపించింది శాస్త్రికి. పిల్లలు తనను అల్లరి పట్టించటానికి ప్రయత్నిస్తున్నారని అర్థమైంది. తనిప్పుడేం చేయటం?

బయలుదేరబోతుండగా ప్రకాశరావుగారు చెప్పిన మాటలు తనకి గుర్తుకు వచ్చేయి. "ఉపాధ్యాయుడి జీవితం మొట్టమొదటి క్లాసులో తేలిపోతుంది. ఆ రోజు విద్యార్థులా ఉపాధ్యాయుడికి ఎన్నో విషమపరిస్థితులు సృష్టించి పరీక్ష చేస్తారు. ఆ పరీక్షలో నెగ్గితే ఇక ఆ వృత్తిలో శాశ్వతంగా నెగ్గినట్లే. కాని నెగ్గాలంటే నిగ్రహం, చాతుర్యం, తెలివితేటలు వుండాలి" అన్నాడాయన.

**బడిపంతులంటే గౌరవం తక్కువ. తెలుగు పంతులంటే మరీను. అందులోనూ నీతీ, నిజాయితీ వున్నవాడు బ్రతకడం ఎంత కష్టమో అనుభవం మాత్రమే చెప్పగలదు.**

శాస్త్రి మాట్లాడకుండానే కళ్లతోనే మందలిస్తున్నట్లు తలెత్తి క్లాసు వైపోసారి చూచి, హాజరు పిలవటం ప్రారంభించేడు. గుసగుసలు సాగుతూనేవున్నా, హాజర్లు పిలవటం విఘ్నం లేకుండానే ముగిసింది.

హాజరైపోగానే పుస్తకం తెరిచేడు శాస్త్రి. "హాచ్చి!" అని తుమ్ము వినిపించింది; వెనుక బెంచీల కింద నుంచి. ఆ విషయాన్ని గమనించినట్లే ఒక క్షణం ఊరుకొని, ఆ తర్వాత మెల్లగా మొదలుపెట్టాడు శాస్త్రి. "పిల్లలు పరబ్రహ్మస్వరూపు లన్నారు పెద్దలు. అంటే ఏమిటో తెలుసా? అల్లరి చేసినా చదువుకొంటే పిల్లలు దేముళ్ల లాంటివారన్నమాట. 'అల్లరి పిల్లలు చేయకపోతే మరెవరు చేస్తారోయ్?' అనేవారు చిన్నతనంలో మా మాస్టారు ఒకాయన. ఆ మాటకొస్తే చిన్నతనంలో నేనూ అల్లరి చేసినవాడినే. అసలు ఎంత ఎక్కువగా అల్లరి చేస్తే అంత ఆరోగ్యం కూడానుట! కాని, ఆ అల్లరి కూడా క్రమబద్ధంగా వుండాలి. క్లాసులో అల్లరి చేస్తే నష్టపొయ్యేదెవరు? మీరు పిల్లలు. కనుక క్లాసులో చదువుకొని, బయటికెళ్లి క్రమబద్ధంగా అల్లరి చెయ్యటం తెలివిగలవాళ్ల లక్షణం. పోతేఇవాళ మీకు అల్లరి చెయ్యాలని కుతూహలంగా వుంది కనుక పాఠం మానేస్తాను. కాని మన సాహిత్యపరిణామాన్ని గురించి క్లుప్తంగా చెప్తాను. ఎందుకంటే మన సాహిత్యానికెంతో చరిత్ర వుంది. ఆ చరిత్ర తెలుసుకోనిదే మన సాహిత్యవిలువలేమిటో, ఉపయోగమేమిటో మీకు బోధపడదు" అంటూ సాహిత్యచరిత్ర చెప్పటం మొదలుపెట్టేడు. కథలాగా చెబుతున్న అతని ఉపన్యాసంలోని కమ్మదనానికి ముగ్ధులై నిశ్శబ్దంగా వింటున్నారు పిల్లలు.

గంట కొట్టేరు. శాస్త్రి ఉపన్యాసం ముగించి, ప్రశాంతంగా వున్న క్లాసులో నుంచి విశ్రాంతి గది వైపు నడిచేడు.

"మొదటి క్లాసు ఎలాగుందేమిటోయ్?" దారిలో కనిపించిన ప్రకాశరావుగారు నవ్వుతూ అడిగేరు. ప్రకాశరావు గారు, శాస్త్రి తండ్రి గారి వద్ద కొంతకాలం చదువుకొన్నారు. అందుకే శాస్త్రి అంటే ఆయనకు ప్రేమ ఏర్పడింది.

"బాగానే జరిగిందండీ" శాస్త్రి జవాబిచ్చేడు.

ఇద్దరూ విశ్రాంతి గదికి చేరుకొనేసరికి

## భయమేసిందట!

ఎవరికి? బాలీవుడ్‌లో వివాదాస్పదవిషయాలకు రాణి వంటి నటి మమతాకులకర్ణికి. అబ్బే, మమతకు భయమేమిటీ? అని తీసిపారేయకండి. పంజాబ్ షేర్‌గా పేరు పడిన నిన్నటి మేటినటుడు ధర్మేంద్రతో ఒక సినిమాలో మమత నటిస్తుండగా, ఆమె చిరకాలవాంఛ ఒకటి తీర్చుకోవాలనుకుందిట. అదేమిటంటే ధరమ్‌జీతో కలిసి ఓ ఫొటో తీయించుకోవాలని. ఫొటోగ్రాఫర్లను కోరిందట, ఎలాగైనా ఆయనతో తనను ఫొటో తీయమని. తీరా ఫొటో కోసం ధరమ్‌జీ పక్కన నిలబడేసరికి, ఇదుగో, ఇలా నోట్లో వేలు పెట్టుకుని చిన్నపిల్లలాగా భయపడుతూ కనిపించింది. ఫొటో సెషన్లకు ఏ



మాత్రం భయపడకుండా ఎలాంటి పోజులైనా ఇచ్చే మమత అలాగెందుకు చేసిందో అని అడిగితే, "నాకెందుకో ధరమ్‌జీ పక్కన నిలబడ్డాక భయమేసింది సుమా!" అందిట. ఔరా!

ఎస్.

## అప్పులు తీర్చేసుకున్నా!

అంటున్నాడు బిగ్ బీ అమితాభ్‌బచ్చన్. 'అక్స్' చిత్రానికి ఇంతకు మును పెన్నడూ ఇవ్వనంత ప్రచారమిచ్చి, విడుదలయ్యాక జనానికి నిరాశ కలిగించారు దర్శకనిర్మాతలు. దాన్ని గురించి చెబుతూ, "ఆడ్ ఫిల్మ్స్ తీసేవారు సినిమాలు మాత్రం ఎందుకని తీయకూడదూ? అందుకనే సొంతంగా కొత్త దర్శకుణ్ణి పెట్టుకుని విభిన్నంగా చేసామీ చిత్రాన్ని. ఆ స్క్రిప్టు చదివి చాలా సంతోషించాను. మనోజ్‌బాజ్‌పాయి వంటి ప్రతిభ గల నటుణ్ణి కూడా అందుకనే తీసుకున్నా - నాతో కలిసి నటించేందుకు. అయినా ఏమైతేనేం, నేను నా అప్పులన్నిటినీ తీర్చేసుకున్నా. ఇంక ఆనందం కాక మరేమిటి?" అంటున్నాడు అమితాభ్. గమ్యసాధన జరిగిపోయింది కదా, సినిమా ఎలా పోతేనేం?



ఎస్.

సుబ్రహ్మణ్యశర్మ గారున్నారక్కడ. శాస్త్రిని ఆయనకు పరిచయం చేసేరు ప్రకాశరావు గారు.

సుబ్రహ్మణ్యశర్మ గారా స్కూల్లో తెలుగు హెడ్డు. వర్చస్సుతో వెలిగిపోయే పుష్టి అయిన విగ్రహం ఆయనది. మనిషి కాస్త ఛాందసుడు. పాత ఆచారాలు, సంప్రదాయాలు వదల్లేకపోవటం వల్లనే ఆయన్నంతా అలా అంటూంటారు.

కాస్సేపు ఆ మాటా ఈ మాటా అయ్యేక, "నీవు విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణుడవైతివా? లేక ఉభయభాషాప్రవీణుడవా?" అని లాల్చీ జేబులో నుంచి పొడుంకాయను తీస్తూ అడిగేరు శర్మ గారు.

"ఏదీ కాదండీ, తెలుగు ఎం.ఏ."

"అటులనే దొలుతనే తలచియుంటిని. ఏలయన నీ వేషభాషాదు లాంగిలేయ సాంప్రదాయికముగ నున్నవి. కాని, ఆంధ్రభాషాబోధకున కుండవలసిన తీరున లేవు!" అంటూ ఒక పొడుము పట్టు లాగి "నీవునూ పీల్చెదవా?" అని శాస్త్రి వైపు చూచేరాయన.

"నా కలవాటు లేదండీ."

"ధూమపానము చేసెదవు కాబోలు!"

"నా కిటువంటి దురభ్యాసాలేమీ లేవండీ!"

"అటులైన పొడుము పీల్చుట దురభ్యాసమనియా నీ అభిప్రాయము? అటులెన్నటికినీ గాదు. పండితుడన్న వాడెల్ల పొడుము పీల్చు టొక యాచారము" అంటూ, ఇంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లుగా లేచేరాయన. "మరచితిని, తరగతి యున్నది ఇప్పుడు" అంటూ వెళ్లేరు.

శాస్త్రి ఆయన పోయినవైపే చూస్తూ వుండిపోయేడు.

"ఏమిటోయ్, అలా వింతగా చూస్తున్నావ్?"

"అబ్బే, ఏం లేదు."

"ఆయన మాటలూ, చేతలూ నీకూ వింతగానే వున్నాయి కదూ? ఇంతకన్నా వింతగా ఆయన మాట్లాడుతారు. రిక్షావాడిని 'మానవవాహనాధీశ్వరా!' అని పిలవటం కూడా కద్దు. కాని ఆయన మహాపండితుడు. సహృదయుడు. కాని కాలంతో మారటం చేతకాని మనిషి. అందుకే ఆయన్ని ఈ కాలపు లోకం గుర్తించలేదు" అన్నారు ప్రకాశరావు గారు సానుభూతితో.

ఆ వేళంతా స్కూలును గురించిన కబుర్లతోనే గడిచిపోయింది శాస్త్రికి.

మర్నాడు మళ్లీ వెనుకటి రోజు పోయిన క్లాసుకు పోయేడు. క్లాసులోకి అడుగు పెడుతుండగానే వెనుక బెంచీల నుంచి ఘొల్లున నవ్వు వినిపించింది. కాస్సేపు ఆ నవ్వు నాలుగువైపులా విహారం చేసి, దానంతటదే సద్దుమణిగింది.

అటెండెన్సు రిజిస్టరు తెరుస్తూ గోడ వైపు చూసేడు శాస్త్రి. పిల్లలు నవ్వటానికి కారణం బోధపడింది. గోడలన్నిటి మీదా "పిలక లేని తెలుగు పంతులు హెహెహె!" అని వ్రాసి వుంది. దానిపైన అతని బొమ్మ వికారంగా చిత్రించేరు. రెండో వైపు "పిలక వుంటే ఈ పంతులు ఓహోహో!" అని వ్రాసి, దానికి పైగా అతనికి పిలక వుంటే ఎలావుండేదీ ఊహాచిత్రం వేసేరు.

చూచీ చూడనట్లుగానే చూచి, హాజరు పిలవటం ముగించేసేడతను. "నిన్న చెప్పిన విషయం మీ కెంతవరకు గుర్తుందో పరీక్షిస్తాను ముందు. ఆ తర్వాత మిగతా ఉపన్యాసం పూర్తి చేస్తాను" అన్నాడు శాస్త్రి.

"చిత్తం, చిత్తం!" వెనుక బెంచీల్లో నుంచి వచ్చేయా మాటలు.

శాస్త్రికీ పరిస్థితి కాస్త కష్టంగానే తోచింది. 'ఏం చేయాలా?' అని అర్ధనిమీలితనేత్రాలతో కాస్సేపు ఆలోచించేడు.

"అబ్బాయిలూ!" అన్నాడు యథాలాపంగా.

"ఓయ్... ఓయ్!"

"అమ్మాయిలు కూడా వున్నారూ!" మూకఉమ్మడిగా వచ్చేయి జవాబులు.

శాస్త్రి కీ తడవ చిరాకెత్తింది. మంచితనం ఎదుటివాడి పైన పని చేయనప్పుడు మానవునికి కోపం, చిరాకు జాస్తి కావటం సహజమే కదా!

"పిల్లలు కదా అని ఇంతవరకు మీ అల్లరి చూచీచూడనట్లు సహించి ఊరుకొన్నాను. కాని ఇక ఊరుకోను!" తీవ్రంగా అన్నాడు.

క్లాసంతా కాస్సేపు నిశ్శబ్దమైంది.

"ఆదికవి అంటే ఎవరు, ఆంజనేయులూ?"

ఆంజనేయులు జవాబిచ్చేడు. అందరినీ అలాగే ప్రశ్నలడగసాగేడు.

"రామకృష్ణుడెవరో చెప్పు, మాధవరావు!"

"నా స్నేహితుడండీ!" ఠపీమని జవాబు చెప్పి, కక్ష తీర్చుకొన్నట్టు, గర్వంగా క్లాసు వైపు చూసేడు మాధవరావు. క్లాసంతా మళ్లీ నవ్వులతో నిండిపోయింది.

"తెనాలి రామకృష్ణుడు..."

"అవునండి. వాళ్ల నాన్న తెనాలిలో కొంతకాలం పని చేసేరు. అప్పుడు వాడు కూడా కొన్నాళ్లక్కడే వున్నాడు. అందుకని మేమంతా వాడిని 'తెనాలి రామకృష్ణు'డని పిలుస్తుంటాము.

ఇందులో తప్పేముందండీ?" గుక్క తిప్పుకోకుండా అన్నాడు మాధవరావు.

శాస్త్రి అతని జవాబుకు నిర్విణ్ణుడయేడు. క్రిందటి రోజు తన విజయానికి ప్రతిగా ఈ రోజు వీళ్లు ప్రతీకారం తీర్చుకొనే ప్రయత్నంతో వచ్చినట్లు గ్రహించేడతను. కాని లొంగిపోయి, వాళ్ల దృష్టిలో అలుసు కాదలుచుకోలేదు. అలాగని విరోధం పెట్టుకోవటమూ అతనికిష్టం లేదు. అందుకే మధ్యేమార్గ మేమిటా అని ఆలోచించి, ఆఖరికి విషయం మార్చాలని నిశ్చయించుకొన్నాడు. మరుక్షణంలో మొహంలో లేని చిరునవ్వును తెచ్చిపెట్టుకొన్నాడు.

"భలేవాడవోయ్ నువ్వు! తెనాలి రామకృష్ణుడి సంగతలా పోనీయ్ కాని మీ నాన్నగారి పేరేమిటీ?"

"మా నాన్న పంచాయతీ బోర్డు ప్రెసిడెంట్." అతని జవాబులో గర్వం తొణికిసలాడింది.

"మీ నాన్న పేరోయ్ నేనడిగింది! ఆయన పేరు ప్రెసిడెంటు కాదుగా?" సర్వసాధారణంగానే అన్నాడు శాస్త్రి.

కాని పిల్లలంతా మళ్లీ నవ్వేరు. మాధవరావు మొహం కోపంతో, అవమానంతో జేవురించింది. శాస్త్రి వైపు తీక్షణంగా ఓ మారు చూచి తల వంచుకొన్నాడు.

"నేనడిగింది మీ నాన్నగారి పేరు మాధవరావ్!" అనునయిస్తున్నట్లుగా అన్నాడు శాస్త్రి.

"నేను చెప్పను!"

"వద్దులే, కూర్చో" పరిస్థితి విషమించే సూచనను గమనించి శాస్త్రి అన్నాడు.

కాని మాధవరావు కూర్చోలేదు. పుస్తకాలు తీసుకొని బయటికి వెళ్లిపోయేడు, విసవిసా నడిచి.

అనుకోని ఈ సంఘటన శాస్త్రికి ఆశ్చర్యాన్నే కాకుండా ఆవేదననూ కలిగించింది.

క్రిందటి రోజు మొదలుపెట్టిన ఉపన్యాసాన్ని అలాగే పూర్తి చేసి, గంట కొట్టగానే విశ్రాంతి గదికి వెళ్లేడు. జరిగినదంతా ప్రకాశరావు గారికి చెప్పేడు.

అంతా విని ప్రకాశరావు విషాదంగా నవ్వేరు. "నువ్వింకా కుర్రవాడివోయ్. కాని, ప్రపంచంలో ఈ కాలంలో బ్రతకాలంటే లౌక్యం అవసరం. అందులోనూ మనం చేసే ఉద్యోగం బడిపంతులు! 'బ్రతకలేక బడిపంతులు' అని ఎందుకన్నా రనుకొన్నావు? బడిపంతులు గంగిరెద్దుతో సమానం. గంగిరెద్దు అన్నదానికల్లా తల ఊపినట్లు మనం కూడా ఇష్టమున్నా, లేకపోయినా తల ఊపాలి. రాని నవ్వులు నవ్వాలి. నలుగురిని పొగిడి మంచి చేసుకోవాలి. ఇతరులకైతే తమ పైవాళ్ల కవన్నీ చేస్తే సరిపోతుంది. కాని బడి పంతులున్నాడు చూసేవ్, తను పాఠం చెప్పే పిల్లలక్కూడా లోకువే. వాళ్లేమన్నా అంటే ఉద్యోగం కాస్తా పోతుంది. ఏమైనా నువ్వు చేసింది మంచి పని కాదు శాస్త్రీ! మాధవరావంటే అల్లరిపిల్లల నాయకుడు. పైగా పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు, ఈ స్కూలు కమిటీ సెక్రెటరీ కొడుకు."

"ఉద్యోగం పోతుందని నేను భయపడలేదండీ! కాని నేనన్న మాటల్లో అంత కూడనిదేముందా అనే నా బాధ!"

"బాధపడి లాభం లేదోయ్! ఇవి చాలా చిన్న విషయాలు. ఇంతకన్నా బాధాకరమైన విషయాలను ఎదుర్కోవలసివస్తుంది ముందు ముందు. ఈ వేళ సాయంకాలం నీకు వారి వద్ద నుంచి పిలుపు తప్పదు! ఏమని సమాధానం ఇస్తావో ఆలోచించుకో."

అనుకొన్నట్లుగానే సాయంకాలానికి పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు, స్కూలు కమిటీ సెక్రెటరీ అయిన చంద్రయ్య గారి వద్ద నుంచి శ్రీముఖం వచ్చింది. ప్రకాశరావు గారి బలవంతం వల్ల శాస్త్రి వెళ్లక తప్పలేదు.



ఠీవిగా పడక కుర్చీలో పడుకుని చుట్ట కాలుస్తున్న చంద్రయ్యకు నమస్కారం చేసేడు శాస్త్రి వెళ్లి.

ఆయన ఒక నిమిషం అతని వైపు పరీక్షగా చూచి, "కూర్చోవయ్యా!" అన్నాడు అధికారయుక్తంగా.

ఆయన అమర్యాదప్రవర్తనకు శాస్త్రికి ఒళ్లు మండింది. సంతకం చేసేమాత్రం చదువు రాని వేలిముద్రల రాయుడికి, కష్టపడి చదువుకొని ఇంత విజ్ఞానం సంపాదించుకొన్న వాళ్లమీద అధికారం! 'పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికేసినట్లు' వీళ్లు తమ అధికారాన్ని ఇలా దుర్వినియోగం చేయటం! తానే విచారపడ్డాడు మనసులో.

ప్రకాశరావు గారు చెప్పిన మాటలతోపాటు 'అనువు గాని చోట అధికులు మనరాదు' అని అనుభవంతో చెప్పిన పెద్దల మాటలు జ్ఞాపకం వచ్చి మెదలకుండా వూరుకొన్నాడు.

"మీదే వూరు?"

ఊరి పేరు చెప్పేడు శాస్త్రి.

"చాలా దూరం వచ్చేవ్! బిఏనా, ఎంఏనా?"

"ఎంఏ."

"అందుకేనా అంత గర్వం?"

సూటిగా వచ్చిన ఆ ప్రశ్న అతన్ని స్తబ్ధుణ్ణి చేసింది. వెంటనే జవాబియ్యలేకపోయేడు.

సెక్రెటరీ చుట్ట కొరికి, కాండ్రించి ఉమ్మేసివచ్చి కూర్చున్నాడు.

"అయితే ఉద్యోగం చెయ్యాలని లేదన్నమాట!" ఆరిపోయిన చుట్టను ముట్టిస్తూ అన్నాడు చంద్రయ్య.

"అలా అనడంలో మీ ఉద్దేశ్యం?"

"మాధవరావు తెలుసుగా నీకు?"

"క్లాసులో కుర్రాళ్లందరితోపాటు అతనూ తెలుసు."

"వాడెవరో తెలుసా? నా కొడుకు వాడు. ఎలాంటి వాడంటావ్?"

## ఫ్లాపైనా ప్రచారమే!

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సుభాష్‌ఘై 'యాదేఁ' అని ఓ సినిమా తీశాడు. అది కాస్తా అట్టర్ ఫ్లాపై కూర్చుంది. చిత్రం విడుదలకు ముందే విపరీతంగా ప్రచారం చేయించాడు. ఏం చేసినా ఎందుకనో పాపం, సినిమా ఘోరంగా దెబ్బ తింది. దాన్ని గురించి అడిగితే, "మన దేశంలో నేననుకున్న స్థాయికి జనం స్పందించలేదు కానీ విదేశాల్లో 2.5 మిలియన్ల వ్యాపారం చేసిందా చిత్రం. యుఎస్‌లో టాప్ 20 చిత్రాల్లో ఒకటిగా నిలబడింది. సాధారణంగా నా చిత్రమంటే జనం ఎగబడతారు. పైగా హీరో నేటి మెగాస్టార్ హృతిక్. చాలా ఆశించారు జనం. మరి వాళ్లు ఆశించింది అందులో కనిపించలేదేమో! కానీ విమర్శకులు మాత్రం బాగుందన్నారు. అది చాలు నాకు. ఇట్లాంటి వీటిని ఓ చిరునవ్వుతో అంగీకరించాల్సివుంటుంది ఎంత పెద్ద దర్శకనిర్మాతలకైనా, ఒక్కోసారి" అంటున్నాడు కాస్త బాధగానే. సినిమా ఫ్లాపైనా ఇంకా టీవీలో మాత్రం గొప్పగా మ్యూజికల్ హిట్టనే చూపుతున్నారు. ముగ్గురు కూతుళ్లను తండ్రి ఎలా చూసుకోవాలనేది మనకు పాత విషయమే కానీ, కాలాన్ని బట్టి విదేశాల్లో సరికొత్త విషయమేమో మరి!

ఎస్.

"నన్నిప్పుడే ఏం చెప్పమంటారు? కొత్తగా వచ్చినవాడిని. తెలివి గలవాడుగానే వున్నాడు. కాని ఇంకా చిన్నతనం వదల్లేదు..."

"నీకు వదిలిందిటయ్యా ముందు? పొద్దున, క్లాసులో ఏమో అన్నావటగా వాడిని? నీ మంచికే చెప్తున్నా. ఇక నుంచైనా కాస్త పిల్లలను కనిపెట్టి పోతుండు. ఎవరితో ఎలా మెలగాలో కాస్త నేర్చుకో! ఇక వెళ్లు!" గుప్పున పొగ వదులుతూ అన్నాడాయన.

కాని శాస్త్రి వెళ్లలేదు. పొంగి వస్తున్న ఆవేశాన్ని బలవంతంగా అణుచుకున్నాడు. తన ఉద్యోగం ఊడిపోయినా పర్వాలేదు. కాని ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకొని బానిసలా బ్రతకలేడు. భావి భారతపౌరులుగా పిల్లలను తీర్చిదిద్దవలసిన బాధ్యత గల తను, ఆ పిల్లల దగ్గరా, వాళ్ల తల్లిదండ్రుల దగ్గరా తన ప్రవర్తనను గురించి పాఠాలు నేర్చుకోవటం అసహజం, అవమానం! పవిత్రమైన ఉపాధ్యాయవృత్తికే అపచారం! ఏమైనా కానీ దీన్ని ఎదిరించాలన్న నిశ్చయానికి వచ్చేడు అతను.

"మీరు చెప్పిన విషయాలను కాదనవలసి వస్తున్నందుకు విచారిస్తున్నాను. మీ పిల్లల అభివృద్ధినే మీరు నిజంగా కోరేవాళ్లయితే అలా చెప్పరు. ఒక్క విషయం మీకు మనవి చేయదలుచుకొన్నాను. ఉపాధ్యాయుడి దృష్టిలో పిల్లలంతా సమానులే! ఎవరి సంగతెలా వున్నా నా దృష్టిలో మాత్రం అంతే!"

"అందుకని పదిమందిలో పసిపిల్లవాడిని పట్టుకొని అవమానపరుస్తావటయ్యా?" ఛర్రున లేచేడు చంద్రయ్య.

కాని శాస్త్రి చలించలేదు. ఏదో అద్భుతమైన శక్తి ప్రవేశించిందతనిలో. "క్షమించండి. కేవలం మీ పిల్లవాడు చెప్పిన మాటల నాధారంగా చేసుకొని మీరు నన్ను నిందిస్తున్నారు. కానీ మీరో విషయం మరిచిపోయేరు. ఒక పిల్లవాడికి తన మేస్టరేదో అన్నందుకే అంత అవమానమైతే, పదిమందికీ చదువు చెప్పవలసిన మేస్టర్ని ఒక కుర్రాడు అందరి ముందూ అవమానం చేస్తే ఆ ఉపాధ్యాయుడి పరిస్థితేమిటో, అతనెంత బాధపడతాడో ఆలోచించండి మీరు!"



చంద్రయ్య ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయేడు. మనిషి కాస్త తగ్గినట్లు కనిపించేడు. కానీ తను పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు!

"అయితే... అయితే మా వాడు నిన్ను అవమానపరిచాడంటావుటయ్యా?"

"పెద్దలు తమరు అనవసరంగా ఉద్రేకపడకండి. మాధవరావు నా తమ్ముడి లాంటివాడు. అతను నన్నేమన్నదీ, ఏం చేసిందీ నేను ఇప్పుడు చెప్పుకోలేను. కాని ఒక్కటి మాత్రం నిజం. అతనంటే నాకేలాంటి ద్వేషమూ లేదు. అతన్ని మంచితనం మీద మంచిదారిలో పెట్టాలనే నేను నిశ్చయించుకొన్నాను. కాని, మీరు ఇంత చిన్న విషయంలో జోక్యం చేసుకొంటారని మాత్రం అనుకోలేదు. తండ్రిగా మీకతని పట్ల ఎంత ప్రేమ వుందో, విద్య చెప్పే ఉపాధ్యాయుడుగా అతని మంచిచెడ్డలు చూడవలసిన బాధ్యత నాకూ వుంది."

చంద్రయ్యకు శాస్త్రి మాటల్లో సత్యం బోధపడినట్లుంది. కాస్త మెత్తబడ్డాడు. కాస్సేపు ఆలోచించి ఏదో నిశ్చయానికి వచ్చేడు.

"నీవు చెప్పింది నిజమేనయ్యా! వాడు చెడిపోతున్నాడు. ఆ విషయం నాకు తెలుసు. కాని దాన్ని ఒప్పుకొనే ధైర్యం, వాడిని చక్కదిద్దుదామన్న ఆలోచనా నాకింతకు ముందెప్పుడూ కలగలేదు. ప్రతివాళ్లూ నేను చెప్పిందానికి తందానా అనటం తప్పితే, నీలాగా ధైర్యంగా నిలబడి, నిజాన్ని చెప్పినవారు లేకపోయేరు. నీవు చాలా తెలివైనవాడిలా కనిపిస్తున్నావు. వాడి మంచిని నిజంగా నీవు కోరేవాడివైతే ఒక పని చెయ్యి. నయానా భయానా వాడిని కాస్త కట్టుదిట్టం చేసి చదువు చెప్పు. నీవు కోరినంత డబ్బు ఇస్తాను."

ట్యూషన్ అనేసరికి శాస్త్రి ఒప్పుకోలేదు. తన అనంగీకారాన్ని తెలియబరిచేడు. కాని చంద్రయ్య కప్పటికే అతని మీద గురి ఏర్పడిపోయింది. బలవంతం చేసి ఆఖరికి అతన్ని ఒప్పించేడు.

మర్నాడు శాస్త్రి పడక్కుర్చీలో కూర్చొని చదువుకొంటూండగా మాధవరావు వచ్చి గుమ్మంలో నిలబడ్డాడు. శాస్త్రి అటు చూచేసరికి, తల వంచుకొని నిలబడ్డ మాధవరావు కనిపించేడు.

కొడతాడేమో, తిడతాడేమో, కనీసం 'ఏం వచ్చావ్?' అనైనా అంటాడేమో అని భయపడ్డ మాధవరావుకు, నవ్వుతూ ఆహ్వానించిన శాస్త్రిని చూచేసరికి అతని మీద గౌరవం పెల్లుబికింది. అనుకోకుండానే "నేను తప్పు చేసేను, మాస్టారూ! నన్ను క్షమించండి" అన్నాడు కంటి వెంట నీరు కారుస్తూ.

క్రమంగా మాధవరావు మారిపోయి, క్లాసులోకెల్లా బుద్ధిమంతుడయ్యేడు. వెనుక బెంచీలలోని స్థానం మొదటి బెంచీకి మారింది. అతని తత్వం కొందరికి విడ్డూరమనిపించకపోనూ లేదు.

ఏమైనా, శాస్త్రి వద్దకు ట్యూషన్‌కు వచ్చేవాళ్ల సంఖ్య కూడా క్రమంగా పెరిగింది. వాళ్లను చూచి వీళ్లూ, వీళ్లను చూచి వాళ్లూ రాసాగేరు. మంచివాడనీ, తెలివి గలవాడనీ పేరు పడిపోయింది ఆ వూళ్లో.

"నీవు అసాధ్యుడవోయ్!" అన్నాడు ప్రకాశరావు.

శాస్త్రి మెల్లగా చిరునవ్వు నవ్వేడు.

"అదృష్టవంతుడివి కూడా" అంటూ నవ్వేడు ప్రకాశరావు.

## నేనిందుకే పుట్టా!

బాలీవుడ్‌లో నటించేందుకట! ఇలా అన్నదెవరంటే వర్ధమాననటి దియామిర్జా. 'మిస్ ఏషియా పసిఫిక్'గా ఎంపికైన దియ ఇప్పుడు 'ఓం జయ్ జగదీశ్' చిత్రంలో చేస్తున్నది. ఇంకా పేరు పెట్టని ఓ చిత్రంలో మోడల్-కమ్-నటుడు అర్జున్‌రామ్‌పాల్ సరసన చేస్తోంది. "ఆమీర్, షారూఖ్, హృతిక్‌లతో చేయాలని ఎంతో ఇదిగా వుంది నాకు. మొదట్లో అనుకోకపోయినా సినిమాల్లోకి వచ్చాక నేను తీసుకున్న నిర్ణయం సరైనదేనని అనిపించింది. నేనిక్కడికి డబ్బు కోసం కాదు, ఆత్మసంతృప్తి కోసం వచ్చాను. అందాలపోటీల్లో పాల్గొన్న ఇతరుల్లాగా వేదిక మీద మదర్ థెరిసాలా వుంటానని సినిమాల్లోకి రాలేదు. నటన, నాట్యాల్లో శిక్షణ తీసుకున్నాను. సినిమా ఒక శక్తిమంతమైన మీడియా. దీని ద్వారా లక్షల, కోట్లమంది ప్రజలకు దగ్గర కావచ్చు. ఇక్కడికొచ్చాకే నేను చేస్తున్న పని సరైనదనిపించింది. ఏ పని చేయటానికి నేనీ భూమి మీద పుట్టానో ఆ నా కలల ప్రపంచం ఇదే, ఇదే!" అంటూంది చాలా ఎమోషనల్‌గా. చూద్దాం, ఎంత పేరు సంపాదిస్తుందో!

ఎస్.

కాలం తన దోవన తాను నడిచిపోతూనేవుంది -వెనుకచూపు లేకుండా. కాని నడిచిపోతున్న ఆ కాలంలో నుంచి-దాగివున్న సత్యాలు బయటపడుతున్నాయి.

ఏదీ కూడా పైకి కనిపించినంత అందంగా, మంచిగా తరచిచూస్తే కనిపించదు. ఈ సూత్రం మనుషులకే కాదు, సంస్థలకూ, మానవుల తత్వాలకూ-అన్నిటికీ వర్తిస్తుంది. 'ఇదుగో ఈ అత్తికాయ మాత్రమే' ఆ స్కూల్లో కూడా పని చేస్తున్నది.

శాస్త్రి కొత్తలో అక్కడికి వచ్చినప్పుడు తోటి ఉపాధ్యాయుల చిరునవ్వులూ, ఆదరణపూర్వకమైన మాటలూ, తేనెలూరే పలకరింపులూ అతన్ని ఆనందంలో ముంచెత్తేయి. 'మానవులంతా ఇంత మంచిగా వుంటే ఎంత బాగుండు!'నని అనుకొనేవాడు. కాని అది యథార్థం కాదని కాలం చెప్పింది.

ఉపాధ్యాయుల్లో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గానికి ఇంగ్లీషు హెడ్డు సుదర్శనం నాయకుడు. రెండో వర్గానికి లెక్కల హెడ్డు నరసింహమూర్తి నాయకుడు. మొదటివారు అతివాదులైతే రెండోవారు మితవాదులు. కులమతరాజకీయ ప్రాంతీయభావాల ననుసరించి మిగతావారంతా తలా ఒక వర్గంలో చేరిపోయేరు. పైకి నవ్వుతూ, అంతా కలిసేవున్నట్లు కనిపించినా, అస్తమానం వాడి మీద వీడూ, వీడి మీద వాడూ పుకార్లు లేవదీసుకోవటం, అవహేళనలు చేసుకోవటంతోనే సరిపోతుంది వాళ్లకు.

పోతే, ఏ వర్గానికీ చెందకుండా తటస్థంగా వున్న వారిద్దరే వున్నారు. అందులో ఒకరు సుబ్రహ్మణ్యశర్మ గారు. ఆయన కాయనే ఒక ప్రత్యేకవర్గం. ఆ వర్గంలోకి ఇతరులెవ్వరూ రాలేరు. ఆయనకు తన కఠోరభాషాప్రపంచం తప్ప మరేమీ అక్కర్లేదు. కాకపోతే నెల కాగానే జీతం కావాలి, అంతే!

రెండో ఆయన ప్రకాశరావు. ఆయన ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడడు. అందరితోనూ మంచిగా వుండాలని ఆయన తాపత్రయం. తటస్థవిధానంతో ఎలాగో ఒకలాగు ఇన్నాళ్లూ నెట్టుకువచ్చేడు.

శాస్త్రి వచ్చిన కొద్దిరోజులకే అతన్ని తమలో చేర్చుకోవాలని రెండు వర్గాలూ పోటీపడి ప్రయత్నించేయి. అంత చిన్న పరిధిలో చదువుకొని విజ్ఞానబోధ చేయడానికి వచ్చినవాళ్లు చేసే చేష్టలూ, వారి మధ్య జరిగే కుట్రలూ, పరస్పరనిందలూ-నవ్వుతూనే మంచిగా వున్నట్లు నటిస్తూనే ఒకరి మీద ఒకరు విసుర్లు విసురుకుంటూ జరుపుకొనే ఈ 'ప్రచ్ఛన్నయుద్ధం' చూచి శాస్త్రికి అసహ్యం వేసింది. అంత సంకుచితమనస్తత్వాలు కల వీళ్లు పవిత్రమైన ఉపాధ్యాయవృత్తికే ద్రోహం చేస్తున్నారని ఆవేదన పడ్డాడు. సంఘం క్షీణిస్తున్నదంటే, విద్యార్థుల్లో క్రమశిక్షణా, నైతికవిచక్షణ లోపిస్తున్నదంటే, దానికి ఈ ఉపాధ్యాయులు కూడా కొంతవరకు బాధ్యులు కారా?-అని ఆలోచించేవాడు.

అందుకే అతనెవరినీ ఆత్మీయభావంతో గౌరవించలేకపోయేడు. కాని, తనటువంటి వర్గాలకూ, తత్వాలకూ అతీతంగా వుండదలుచుకొన్నాడు. ఆ మాటే చెప్పేసేడు నిర్భయంగా.

దానితో ఇరువర్గాలకూ అతని మీద కోపం వచ్చింది. పైగా, వచ్చిన కొద్దిరోజులకే అతను గ్రామంలో సంపాదించుకొన్న పలుకుబడీ, తెలుగు పండితుడై వుండికూడా, తమ కన్నా ఎక్కువ ట్యూషన్లు సంపాదించుకొన్నాడన్న అసూయా వాళ్ల కోపాన్ని ద్విగుణీకృతంచేసేయి.

000

రోజులు గడిచేకొద్దీ శాస్త్రి పలుకుబడీ, గౌరవం చుక్కల్లో చంద్రుడిని అందుకొని వెలుగొందసాగేయి. పిల్లలకు అతనంటే ప్రేమ, గౌరవం, అభిమానం, భయం! అతను వాళ్లతో కలిసి తిరిగేవాడు, కథలు చెప్పేవాడు, కలిసి ఆడుకొనేవాడు, నాటకాలాడించేవాడు, పాటలు పాడించేవాడు, చక్కగా చదివించేవాడు!

ఇలా వుండగా పంచాయతీ బోర్డు ఎన్నికలు వచ్చేయి. ఇంతకుముందు అధ్యక్షుడుగా చంద్రయ్య వుంటూవచ్చేడు. కాని ఇప్పుడు ఆయనకు పోటీగా తన కొడుకును నిలబెట్టేడు, ఆ ఊరి మునసబు. దానికి కారణం, ఇరుకుటుంబాల మధ్యా కొత్తగా వచ్చిన విరోధాలు. కాని వారిద్దరూ దగ్గర బంధువులే.

ప్రచారప్రయత్నాలు జోరుగా జరిగిపోతున్నాయి. ఊరంతా రెండు పక్షాలుగా చీలిపోయి, ఒకరి మీద ఒకరు కక్షలు పెంచుకొన్నారు. స్కూల్లో కూడా మునసబు గారి పార్టీ ఒకటీ, చంద్రయ్య గారి పార్టీ ఒకటీ ఏర్పడ్డాయి. కాని ప్రకాశరావు, శాస్త్రీ తటస్థంగానే వుండిపోయేరు.

ఆ రోజు రాత్రి, భోజనం చేసి వ్రాస్తున్న నవల పూర్తి చేద్దామని హరికేన్ లాంతరు ముందు కూర్చున్నాడు శాస్త్రి. అనుకోకుండా వచ్చిన చంద్రయ్యను చూచి ఆశ్చర్యపోతూ పుస్తకం మూసేసేడు.

ఆ విషయం, ఈ విషయం మాట్లాడి, ఆఖరికి ఎన్నికల విషయం ప్రస్తావించి, అతని సహాయాన్నడిగేడు చంద్రయ్య.

"నాకీ విషయాల్లో అంత అనుభవమూ లేదు, ఉత్సాహమూ లేదు. పిల్లలకు చదువు చెప్పుకొని బతికే మాకీ విషయాలన్నీ ఎందుకండీ? దయ చేసి నన్నందులోకి లాగకండి. పైగా నా వల్ల వచ్చే లాభమూ లేదు" అని జవాబిచ్చేడు శాస్త్రి.

కాని చంద్రయ్యకు కావలసింది మందిబలమే కాని, వారివల్ల కలిగే లాభం విషయం ఆయన కనవసరం. ఫలానివారు నా మనిషని

## పెళ్లిళ్ల పేరమ్మ?!

ఎవరినో బలవంతంగా పెళ్లాడమని కాదు. "డింగ్ డాంగ్" సుందరి మాధురీదీక్షిత్ కనిపించిన ప్రతివారినీ యమర్జెంటుగా పెళ్లిచేసేసుకోమంటూందిట. అదే జీవితంలో ప్రతి నారికీ కావలసిందని రికమెండ్ చేస్తూందిట కూడా. ఇదేమిటంటారా? టీవీ ఛానెల్‌లో



రాబోయే ఒకానొక కార్యక్రమానికి హోస్ట్‌గా వుండబోతున్న మాధురి చేసే పని అది. ఇందులో అమ్మాయిలు, అబ్బాయిలతో కార్యక్రమం నడిపిస్తూ వారిలో వారికి తగిన జంటలను ఏరిపెడుతుందట. చివరికి పెళ్లిళ్ల పేరమ్మ పనా చేసేది? బాగుంది మాధురీ!

ఎస్.

చెప్పుకోవడమే ఆయనకు తృప్తి.

ఆ విషయమే ఆయన నిర్మొహమాటంగా చెప్పి, "మీరు ఏదో ఒక పార్టీలో చేరకతప్పదు!" అన్నాడు.

శాస్త్రికి పరిస్థితి అర్థమైంది. ఏం చెయ్యడానికీ తోచలేదు. "నాలుగు రోజులాగి ఆ అభిప్రాయం చెబుతాను" అన్నాడు అనుకోకుండానే.

"అలాగే! నాలుగో రోజు రాత్రి వస్తాను" అంటూ వెళ్లేడు చంద్రయ్య.

చంద్రయ్య వెళ్లిన కాస్సేపటికి మునసబు వచ్చేడు. ఆయనా ఆ విధంగానే అడిగేడు. శాస్త్రికి మెరపు లాంటి ఆలోచన వచ్చింది. ఆయనను కూడా నాలుగో రోజు రాత్రికి రమ్మని చెప్పి పంపించేసేడు.

వ్రాసే నవల అవతల పడేసి, మనశ్శాంతి కోసం చదువుకుందామని ఒక నవల తీసేడు షెల్ఫులోనుంచి. తీరా చూస్తే అది 'అసమర్థుని జీవయాత్ర!' శాస్త్రి విషాదంగా నవ్వుకొన్నాడు మనసులో.

'ఏ అరమరికలూ లేకుండా వచ్చినదానితో తృప్తి పడుతూ ప్రశాంతంగా జీవించలేరు ఈ మానవులు! ఒకవేళ అలా ఎవరైనా బ్రతుకుతుంటే, వాడిని చూచి కూడా సహించలేరు. వాడి ప్రశాంతతనూ, సంతృప్తినీ నాశనం చెయ్యడానికి అనుక్షణమూ ప్రయత్నించే వ్యక్తులు కొందరుంటారు సంఘంలో. కొత్తకొత్త సమస్యల దారాలను సాలెగూటిలా వాడి చుట్టూ అల్లి, వాడిని అశాంతిలో, బాధాసముద్రంలో బంధిస్తారు. దానివల్ల వాళ్లకు ఒరిగేదేమిటి?' చిరాకుగా అనుకొన్నాడు మనసులో.

సుషుప్తి ఈ సమస్యల నుంచి అతన్ని దూరంగా తీసుకువెళ్లిందా రోజు.

నాలుగోరోజు రాత్రికి సెక్రెటరీ, మునసబు ఒకరికి తెలియకుండా మరొకరు ఇంచుమించు ఒకే సమయానికి వచ్చేరు. ఈ నాలుగు రోజుల్లో హరిజనవాడలో నుంచి మరొక అభ్యర్థి కూడా పోటీకి దిగేడు.

ముందు వచ్చిన మునసబునూ, వెనువెంటనే వచ్చిన చంద్రయ్యనూ మర్యాదగా ఆహ్వానించి కూర్చోపెట్టేడు శాస్త్రి. అనుకోని ఈ కలయికకు ఇద్దరూ ఆశ్చర్యపోయేరు.

కొన్ని క్షణాలు అతి నిశ్శబ్దంగా గడిచిపోయేయి.

"మీలో ఎవరి పక్షం వహించాలో ఇప్పుడు మీరే చెప్పండి. మీరిద్దరూ బంధువులు. నిన్నమొన్నటి దాకా అనురాగంతో, ఆదరంతో కలిసిమెలిసి వున్న మీరు. ఈ నాడు ఏవో స్వల్పకారణాల వల్ల పోటీలకు దిగి, పట్టుదలలూ, కక్షలూ పెంచుకొంటున్నారు. బ్రతకలేనివాడు కాదు బడిపంతులయ్యేది., బుర్ర వికసింపజేసుకోదలుచుకున్నవాడు అన్న ఉద్దేశ్యంతో నేనీ ఉద్యోగం చెయ్యటానికి వచ్చేను. నకిలీ బంగారం లాంటి బస్తీ జీవితంతో విసిగిపోయి అమాయకులైన పల్లెప్రజల మధ్య ప్రశాంతంగా జీవించవచ్చునన్న భావనతో, ఆశతో నేనిక్కడికి వచ్చేను. నీతి, న్యాయం, ధర్మం మీ మధ్య వుంటాయనుకొన్నాను. కాని మీరు కూడా పదవీకాంక్షలతో, పట్టుదలలతో, అసూయాద్వేషాలు పెంచుకొని, రాక్షసత్వానికి బాట వేస్తున్నారని ఇప్పుడు తెలుసుకొన్నాను. కాని, నాగరకత పేరుతో నీతినీ, న్యాయాన్నీ ఇలా విస్మరించడం అంత మంచి పని కాదు. జాతి అభివృద్ధికే ఇది అవరోధం!" అతని కంఠంలో ఆవేదన జీరాడింది.

మళ్లీ ఒక్క క్షణం నిశ్శబ్దం తాండవించింది. బెల్లం కొట్టిన రాళ్లలాగా ఇద్దరూ అప్రతిభులై కూర్చుండిపోయేరు.

"నేను మిమ్మల్ని అగౌరవపరచాలన్న ఉద్దేశ్యంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. నాకన్నా ఈడులో, అనుభవంలో మీరిద్దరూ చాలా పెద్దవారు. కాని, మీ పతనావస్థను చూచి ఏదో చెప్పాలనీ, మీ మనసులను మార్చాలనీ అనిపించింది. నే చెప్పిన మాటల్లోని న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలూ, మంచిచెడ్డలూ మీరే ఆలోచించుకోండి. మీ మార్గంలో నుంచి మిమ్మల్ని మళ్లించడానికి నా ఉద్యోగం పోయినా నేను లెక్క చెయ్యను!"

చంద్రయ్య, మునసబు ఒకేసారి తలలెత్తి ఒకరిని ఒకరు చూచుకొన్నారు అనుకోకుండా.

"అయినవాళ్లయి మీ ఇద్దరూ అశాశ్వతమైన పదవుల కోసం బంధుత్వాలు తెంపుకొని, ఇలా కొట్లాటలు పెంచుకొని కోర్టులకెక్కి, ఇళ్లూ, ఒళ్లూ గుల్ల చేసుకోవటం వల్ల మీకొరిగేదేమిటో ఆలోచించుకోండి. చెప్పుడుమాటలు విని మీ భవిష్యత్తునూ, మా భవిష్యత్తునూ, మీ పిల్లల పురోభివృద్ధినీ, తరతరాల వారి భవిష్యత్తునూ నాశనం చేయవద్దని కోరుతున్నాను, ప్రార్థిస్తున్నాను, యాచిస్తున్నాను. నాకు మీ ఇద్దరూ కావలసినవారే. నేను వాంఛించేవిస్వతంత్రత, శాంతిసౌభాగ్యాలూ, మీ పిల్లల అభివృద్ధి! ఈ తగవుల కోసం వెచ్చించే మీ శ్రమనూ, ధనాన్నీ, దేశాభివృద్ధికీ, మీ గ్రామప్రగతికీ వినియోగించండి. ఏమంటారు?" అతని మాటల్లో ఆవేదనతోపాటు ఆశ, ఆత్మవిశ్వాసం ధ్వనించేయి.

ఎవరూ ఏమీ అనలేదు. అనడానికి నోరు రాలేదు. శాస్త్రి చెప్పిన విషయాన్ని గురించే ఇద్దరూ ఆలోచిస్తున్నారు. అందులోని సత్యం ఇద్దరికీ అర్థమైంది.

కాస్సేపయ్యాక ఇద్దరూ ఒక నిశ్చయానికి వచ్చినవాళ్లలాగా ఒకరినొకరు మళ్లీ చూసుకొని నవ్వుకున్నారు.

"అయ్య చెప్పిన సలహా ఎలాగుందేమిటి బావా?" చంద్రయ్య అడిగేడు మునసబును.

"పచ్చినిజం చెప్పాడ్రా అబ్బి!" చుట్ట నోట్లో పెట్టి అగ్గిపెట్టె కోసం వెతుక్కుంటూ సమాధానమిచ్చేడు మునసబు.

చంద్రయ్య అగ్గిపుల్ల వెలిగించి మునసబు చుట్టకు నిప్పు ముట్టించేడు.

అగ్గిపుల్ల వెలుగులో శాస్త్రి కంటినుండి

## అమ్మో! అక్షయ్!

మోడల్ రంగాన్నుంచి నటిగా బాలీవుడ్‌లోకి వచ్చిన బెంగాలీసుందరి బిపాశాబసు. ఆమె ఇప్పుడో చిత్రంలో



అక్షన్‌హీరో కమ్ ట్వింకిల్ భర్త అయిన అక్షయ్‌కుమార్‌తో చేస్తూంది. ట్వింకిల్‌తో చాలా చనువుగా వుంటూ ఆనందంగా గడుపుతూంది. కానీ అక్కీతో నటించే దృశ్యాలు మాత్రం చాలా హాట్‌హాట్‌గా వుంటున్నాయట. నిజానికి బిపాశ అంత సుముఖంగా లేకపోయినా, అక్కీయే విభిన్నంగా నటించటం వల్లే ప్రతిభ బయటపడుతుందని బిపాశను ప్రోత్సహిస్తున్నాట్ట. చిత్రీకరణ అయిపోయాకే బిపాశకు అసలు సంగతేమిటో అర్థమైందట. మరా దృశ్యం కోసం వాళ్లు నటించిన చిత్రాన్ని అందరూ చూడాలిగా! కానీ, అక్కీతో జాగ్రత్త సుమా, బిపాశా!

ఎన్.

తళుక్కున మెరుస్తూ రాలిన కన్నీటి బిందునును చూసేరిద్దరూ!

"అదేమిటయ్యోయ్?"

"ఏం లేదు, ఆనందం... తృప్తి. అంతే!"

"చిన్నవారైనా మీరు విచిత్రమైనవారు. మీ సహాయాన్ని మేమెన్నటికీ మరిచిపోము" అంటూ ఇద్దరూ వెళ్లిపోయేరు.

ఆ తర్వాత కొద్దిరోజులకే చంద్రయ్య సహాయంతో మునసబు గారి కొడుకు అధ్యక్షుడుగా ఎన్నికయ్యేడు.

శాస్త్రికి గౌరవం హెచ్చింది ఆ ఊళ్లో. మిగతా మాస్టర్ల అసూయ బుసలు కొట్టింది.

000

పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. పాఠాలు జోరుగా సాగిపోతున్నాయి.

ఉన్నట్టుండి, అనుకోకుండా, శాస్త్రికి ఊరి నుంచి 'ట్రాన్స్‌ఫర్' అయినట్లు ఉత్తరువు వచ్చిందోరోజు.

శాస్త్రి నిశ్చేష్టుడైనాడు.

మునసబో, చంద్రయ్యో ఈ పని చేయించినట్లు, నిమిషంలో పుకార్లు ఊరంతా పాకిపోయేయి.

అనుకోని ఈ సంఘటనను గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు శాస్త్రి. చంద్రయ్య, మునసబు వచ్చేరు.

"మమ్మల్ని క్షమించండి బాబూ! మాకెంతో మేలు చేసిన మీకు అన్యాయం చేసే ద్రోహులం, నీచులం కాదు మేము. మీకిలా జరుగుతుందని ఏ మాత్రం తెలిసినా ఇలా జరగనిచ్చే వాళ్లం కాదు. మా మాట నమ్మండి" అన్నారు.

"నాకు తెలుసు చంద్రయ్య గారూ! నన్ను మీ బిడ్డగా చూచుకొంటున్న మీరీ పని చేయరని నాకు తెలుసు. కాని, ఈ పని ఎవరు చేయించిందీ కూడా గ్రహించే శక్తి నాకుంది. వారే ఈ పుకారు పుట్టించేరు కూడా. అలా చేయించినవారి మీద నాకు కోపం లేదు. వారికి మంచితనాన్నీ, మానవత్వాన్నీ ప్రసాదించవలసిందిగా భగవంతుని ప్రార్థిస్తున్నా. అజ్ఞానులని అనుకోబడే మిమ్మల్ని నేను మార్చగలిగేను కాని, విజ్ఞానవిశారదులైన వాళ్ల బుద్ధులను మార్చే శక్తి నాకు లేదు. అది ఒక్క ఆ భగవంతుడికే వుంది..."

"కాని మీరు మాకు కావాలి బాబూ!" అంటూ వెళ్లేరిద్దరూ.

తోటి ఉపాధ్యాయుల్లో ఒకాయన శాస్త్రి గౌరవార్థం టీ పార్టీ, ఫోటో ఏర్పాటు చేద్దామని సూచించేడు.

"నిండుమనసు, నిష్కల్మషమైన ప్రేమ కావాలి కాని, ఇమిటేషన్ నగల్లాంటి విందులూ, ఫోటోలూ నాకిష్టం లేదు" అన్నాడు శాస్త్రి సుదర్శనంతో.

"అదీ నిజమే మరి..." అంటూ నరసింహమూర్తి రాగం తీసేడు.

"తెలుగు పంతులే అయినా, అందరి కన్నా ఎక్కువ ట్యూషన్లు సంపాదించేడు మొత్తానికి! కొత్త చోట దొరుకుతాయో లేదో, పాపం!" తన విట్టుకు తానే నవ్వుకుంటూ వ్యంగ్యంగా అన్నాడు సుదర్శనం.

"మన బుద్ధి విశాలమైనదైతే ఏ ఊరైనా ఒకటే. ఎంగిలి విస్తరాకుల కోసం ఆశ పడి అర్రులు చాచేవారికే ఆ బాధలన్నీ!" శాస్త్రి ఘాటుగా సమాధానమిచ్చేడు.

సుదర్శనం బుజం తడుముకొన్నాడు, పైగుడ్డ వుందో లేదో అన్నట్టుగా!

బయల్దేరటానికంతా సిద్ధం చేసుకొని, అందరి దగ్గరా సెలవు తీసుకొన్నాడు శాస్త్రి.

"పిన్నవయసులోనే పెద్దవిద్యల నభ్యసించి, నలుగురి చేతా మంచివాడవనియు, తెలివి గలవాడవనియు ననిపించుకొనిన నీకేల బదిలీ రావలసివచ్చెను? ఔరా కాలవైపరీత్యము! న్యాయమున కీ కాలమున నిలువ నీడ లేకుండయున్నదియే! మున్ముందు తెలుగుభాషామతల్లికి సేవ చేయుము బాలకా!" అంటూ ఆశీర్వదించేరు సుబ్రహ్మణ్యశర్మ గారు.

ప్రకాశరావు కళ్లు చెమ్మగిల్లేయి.

తీరా బయల్దేరబోయే ముందు పోస్టుమన్ వచ్చి ఒక కవరిచ్చి వెళ్లేడు. చించి చదువుకొన్నాడు శాస్త్రి.

"గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం వచ్చిందండీ!" సంతోషంతో అన్నాడు.

ఈ వార్త విని కొందరి మొహాలు వికసించేయి. మరికొందరి మొహాలు మాడిపోయేయి.

"ఇప్పుడు మిమ్మల్ని ఆనందంగా సాగనంపుతాం!" చంద్రయ్య అన్నాడు సంతోషంగా.

మాధవరావు, మిగతా పిల్లలూ బిలబిలా వచ్చి శాస్త్రి చుట్టూ మూగేరు.

"మీకు ఎప్పుడైనా కష్టం కలిగిస్తే, మమ్మల్ని క్షమించండి, మాస్టారూ!" దీనంగా అన్నాడు మాధవరావు, శాస్త్రికి నమస్కరించి.

శాస్త్రి కనుకొలుకుల్లో నీరు నిలిచింది. "పిలక లేని పంతులని వ్రాసిందానికేనా? మరేం పర్వాలేదు, నిజమేగా! ఇక క్షమించటమంటావామీరంతా ఫస్టు క్లాసు మార్కులతో పాసైతేనే మిమ్మల్ని క్షమించేది, సరేనా?" అన్నాడు.

పిల్లలు తలూపేరు, మీ మాట శిరసావహిస్తామన్నట్లు!

బండి కదిలింది.

బండి పరుగిడుతుంటే, శాస్త్రి హృదయంలో సంతోషంలా ఎద్దుల మెడల్లో మువ్వలు గలగలలాడుతున్నాయి ■

## అద్దం తిరిగిన కథ

మరేమీ కాదు. సాధారణంగా మోడల్ రంగం నుంచి బాలీవుడ్‌కు వచ్చే నటీనటులే వుంటారు. కానీ నటుడు-దర్శకుడు ఫిరోజ్‌ఖాన్ కొడుకు ఫర్దీన్‌ఖాన్-ఇతన్ని జూనియర్ ఎఫ్.కె. అని కూడా అంటారు-విషయంలో అంతా తారుమారైంది. ఎలాగంటే హీరోగా రంగప్రవేశం చేసినా తొలిచిత్రాలు ఫెయిలైపోయి అతని సమాచారమే వినేవారు లేకపోయారు. అటుపైన 'ప్యార్ తూనే క్యా కియా' సూపర్‌హిట్టయి బాలీవుడ్ 'హాట్ స్టార్' అయ్యాడు ఫర్దీన్. అటుపైన ప్రకటనలకు తోడ్పడి పేరు తెచ్చుకున్నాడు. ఇకనిప్పుడు మ్యూజిక్ వీడియోలు చేస్తున్నాట్ట. బాగా పాపులరైన "కంబఖ్త్ ఇష్క్" పాట చేసిన దర్శకుడు సంజయ్‌గుప్త దర్శకత్వంలో అలీషా చినాయ్ పాడిన పాటకు ఫర్దీన్ చేస్తున్నాడని వినికిడి. నటులంతా ఇలా మోడల్స్ అయిపోతే ఇంకెలా? అయినా ఎలాగోలా పేరు సంపాదించుకునే ట్రిక్కుల్లో ఇదీ ఒకటేమో!

ఎస్.

